క్లుప్తంగా

మైకా పరిశ్రమపై అవగాహన


గనులను పరిశీలిస్తున్న విద్యార్థులు

సైదాపురం: మండలంలో ఉన్న మైకా పరిశ్రమపై కేరళ రాష్ట్రం కొజికోడ్ జిల్లాలోని ఫరూఖ్ కళాశాలకు చెందిన జియాలజీ విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. జియాలాజీ ఫీల్డ్ ట్రిప్‌లో భాగంగా ఆ కళాశాల ప్రొఫెసర్లు, విద్యార్థులు సైదాపురం, గూడూరు, చిల్లకూరు మండలాల్లో ఉన్న ఉన్న మైకా, క్వార్ట్జ్ గనులను పరిశీలించారు. ఖనిజాలకు సంబంధించి విద్యార్థులకు మైన్స్ యజమాని మాగుంట రాహుల్ సేసిరెడ్డి అవగాహన కల్పించారు.

రైతులకు గుర్తింపు సంఖ్య

సైదాపురం: ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను ఇవ్వనున్నట్లు మండల వ్యవసాయాధికారి పి.హైమావతి తెలిపారు. మండలంలోని తురిమెర్ల రైతు సేవాకేంద్రాన్ని గురువారం తనిఖీ చేశారు. రైతులు వారి ఆధార్‌కార్డు, ఆధార్‌కు అనుసంధానమైన ఫోన్ నెంబర్, పాస్‌బుక్ తీసుకుని రైతుసేవా కేంద్రంలో వీఏఏ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలన్నారు.

పక్కాగా సర్వే చేపట్టాలి

సైదాపురం: గ్రామాల్లో నిర్వహిస్తున్న పి4 సర్వేను సచివాలయం అధికారులు పక్కాగా నిర్వహించాలని ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్ ఆదేశించారు. మండలంలోని గిద్దలూరు సచివాలయాన్ని ఆయన గురువారం తనిఖీ చేశారు. అనంతరం సచివాలయం సిబ్బంది నిర్వహిస్తున్న పి4 సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని సచివాలయం అధికారులు సర్వేను పక్కాగా నిర్వహించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రాఘవేంద్ర, సచివాలయం అడ్మిన్ మురళీకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి నగదు పురస్కారం


నగదు ప్రోత్సాహం పంపిణీ

చిల్లకూరు: జాతీయ స్థాయిలో జరిగిన రోప్ జంప్ క్రీడలో మంచి ప్రతిభ చూపిన క్రీడాకారుడికి రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు గురువారం నగదు పురస్కారం అందించారు. మండలంలోని నెలబల్లిరెట్టపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి ఎం.వెంకటేష్ ఇటీవల నేపాల్‌లో జరిగిన అంతర్జాతీయ స్థాయి రోప్ జంప్ క్రీడలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. ఆ క్రీడాకారుడికి రూ.10,116 నగదును ప్రోత్సాహంగా అందించారు. హెచ్‌ఎం విజయలక్ష్మి, పీడీ మస్తాన్‌బీ పాల్గొన్నారు.

ఉత్తమ ఆల్‌రౌండ్ ప్రతిభ


పురుషోత్తమ్‌చౌదరి (అన్వేష్)

చిల్లకూరు: భారత్–నేపాల్ దేశాల మధ్య జరిగిన డిజేబుల్డ్ క్రికెట్ పోటీలలో గూడూరుకు చెందిన క్రీడాకారుడు అత్యుత్తమ ఆల్ రౌండర్ ప్రతిభ కనబరిచాడు. గూడూరులోని చర్చి కాంపౌండ్‌కు చెందిన పురుషోత్తమ్ చౌదరి(అన్వేష్) ఒక చేతితో నేపాల్‌లో జరిగిన టీ–20 మూడు మ్యాచ్‌లలో పాల్గొని తన ఆల్ రౌండ్ ప్రతిభను కనబరిచాడు.

వెటర్నరీ అసోసియేషన్ అధ్యక్షుడి ఎంపిక


కృష్ణారావును సత్కరిస్తున్న సిబ్బంది

వాకాడు: వాకాడు మండల పశువైద్యాధికారి సీహెచ్ కృష్ణారావు జిల్లా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గురువారం ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. మండలంలోని పశువైద్యశాలల సిబ్బంది బాలిరెడ్డిపాళెం పశువైద్యశాలలో కృష్ణారావును శాలువాలతో సత్కరించారు.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

వెంకటగిరి(సైదాపురం): పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను సకాలంలో పూర్తిచేసి రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రామానాయుడు వెల్లడించారు. పట్టణంలోని తెలుగుగంగ అతిథిగృహంలో గురువారం పెండింగ్ పనుల ప్రాజెక్టుల మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. రైతు సంఘం జిల్లా కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

రైలు కింద పడి..

తడ: రైలు కింద పడి గుర్తు తెలియని ఓ యువకుడు మృతి చెందిన ఘటన గురువారం వెలుగు చూసింది. సూళ్లూరుపేట రైల్వే జీఆర్‌పీఏపీ ఎస్‌ఐ చెన్నకేశవ తెలిపిన వివరాల మేరకు.. తడ రైల్వేస్టేషన్ సమీపంలో ఓ యువకుడు రైలు కింద పడి చనిపోయినట్లు సమాచారం అందడంతో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఎరుపు రంగు టీ షర్టు, సిమెంటు కలర్ జీన్స్ ఫ్యాంటు ధరించి ఉన్న మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 70360 43535, 70134 13616 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అసంపూర్తి పాలన

- గత ప్రభుత్వ హయాంలో పక్కా భవనాల నిర్మాణం
- తుది దశలో ఉన్న వాటిపై దృష్టి సారించని కూటమి సర్కారు


వెలికల్లులో పూర్తయినా ప్రారంభానికి నోచుకోని సచివాలయం


అర్ధంతరంగా నిలిచిపోయిన వెల్‌నెస్ సెంటర్ నిర్మాణం

దక్కిలి: ప్రజలు మారుమూల గ్రామాల నుంచి మండల కేంద్రాలకు రాకుండా నేరుగా గ్రామాల్లోనే ప్రభుత్వ సేవలు పొందే విధంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా గ్రామ సచివాలయాలు, రైతు భరోసా, వెల్‌నెస్ కేంద్రాలను నిర్మిస్తూ అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పల్లె పాలనకు శ్రీకారం చుట్టారు. భవన నిర్మాణ పనులు సైతం శర వేగంగా చేపట్టారు. అయితే ఎన్నికలు రావడంతో కొన్ని గ్రామాల్లో భవనాలకు రంగులు వేయడం, మౌలిక సదుపాయాలు, విద్యుత్ పనులు నిలిచిపోయాయి. లక్షలాది రూపాయలు బిల్లులు పెండింగ్‌లో ఉండిపోయాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటు తరువాత పల్లె పండుగ పేరుతో హడావుడి చేశారు తప్ప శాశ్వతమైన భవనాలపై వివక్ష చూపుతున్నారు. తుది దశలో ఉన్న భవనాలను త్వరతగతిన పూర్తి చేసి పల్లె పాలనను అందజేయాలని ప్రజలు కోరుతున్నారు. దక్కిలి మండలంలో 14 సచివాలయాల పరిధిలో రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు ఉన్నాయి. వెలికల్లులో సచివాలయం నిర్మాణం పూర్తయినా ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు. ప్రస్తుతం పాత పంచాయతీ కార్యాలయంలోనే ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. లక్షలు వెచ్చించి నిర్మించిన భవనాలను ఇప్పటికైనా అధికారులు స్పందించి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరలో ప్రారంభానికి చర్యలు



వెలికల్లులో పూర్తయిన సచివాలయం, ఆర్‌బీకే కేంద్రాల విషయాన్ని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం. ఇంకా ఏమైనా ఉన్న కూడా వాటిపై కూడా దృష్టి సారించి ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా పరిశీలిస్తాం.

– టి.గుణశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ దక్కిలి


ప్రారంభానికి నోచుకోని ఆర్‌బీకే కేంద్రం



పాత పంచాయతీ భవనంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు

పోలీసు గస్తీతో ప్రత్యేక నిఘా

నాయుడుపేట టౌన్: రాత్రి సమయల్లో పట్టణంలో పోలీసులు నిర్వహించే గస్తీలో నిఘా పెట్టి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు సీఐ బాబీకి సూచించారు. నాయుడుపేట అర్బన్ పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ గురువారం పరిశీలించారు. సీఐతో మాట్లాడి నేరాల నియంత్రణ విషయాలపై చర్చించారు. అర్ధరాత్రి సమయాల్లో తిరిగే అనుమానితులను స్టేషన్‌కు తీసుకొచ్చి పూర్తి స్థాయిలో విచారణ చేయాలన్నారు.

బీమా సౌకర్యాన్ని వినియోగించుకోండి

గూడూరు రూరల్: భారతీయ స్టేట్ బ్యాంక్ వ్యక్తిగత ప్రమాద బీమా పథకాన్ని మరింతగా విస్తరించి ఏడాదికి రూ.2 వేలతో రూ.40 లక్షల బీమా సౌకర్యాన్ని పొందవచ్చని గూడూరు ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ సురేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రీమియం రూ.100కు రూ.2 లక్షలు మొదలుకొని గరిష్ఠంగా రూ.2 వేలకు రూ.40 లక్షలు పొందవచ్చని పేర్కొన్నారు. ఈ బీమా రోడ్డు ప్రమాదాలు, కరెంట్ షాక్, వరదలు, భూకంపాలు, పాము, తేలు కాటు మరణాలకు వర్తిస్తుందని తెలిపారు. 18 ఏళ్ల నుంచి 70 సంవత్సరాల వయస్సు వరకు ఎవరైనా బీమా చేయించుకోవచ్చని వివరించారు.

బీసీ రుణాలకు నేడు వెరిఫికేషన్

వెంకటగిరి రూరల్: బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు శుక్రవారం దరఖాస్తు పరిశీలన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కోటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో బ్యాంకర్ల సమక్షంలో దరఖాస్తుల పరిశీలన నిర్వహించనున్నట్లు తెలియజేశారు. రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ఒరిజినల్ పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

దేవారెడ్డికి పరామర్శ


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

చిట్టమూరు: ఆరూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత దేవారెడ్డి సుధాకర్‌రెడ్డిని ఎమ్మెల్సీ, గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్, ఎన్‌డీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి గురువారం పరామర్శించారు. సుధాకర్‌రెడ్డి తండ్రి దేవారెడ్డి సుబ్బరాఘవరెడ్డి ఈ నెల 7వ తేదీన చనిపోయారు. దీంతో ఆరూరు గ్రామంలో గురువారం జరిగిన ఉత్తరక్రియలకు వైఎస్సార్ సీపీ నేతలు హాజరయ్యారు. ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ సుబ్బరాఘవరెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల కన్వీనర్ సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శులు పేట రాజీవ్‌రామిరెడ్డి, కామిరెడ్డి కస్తూర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ బీవీ రమణయ్య, దువ్వూరు శేషురెడ్డి, రమేష్‌రెడ్డి, అశ్విన్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, లోకేష్‌రెడ్డి, అనీల్‌రెడ్డి, మధు, కుమార్, దాము తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు


మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉమామహేశ్వరి

దొరవారిసత్రం: వేసవి కాలం దృష్ట్యా ముందస్తుగా తాగునీటి సమస్యలు లేకుండా సంబంధిత అధికారులు దృష్టి సారించి పరిష్కారం చేయాలని స్థానిక ఎంపీపీ దువ్వూరు సుజాతమ్మ కోరారు. గురువారం దొరవారిసత్రం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ శాఖల అధికారులు ఇప్పటి వరకు చేసిన అభివృద్ధి, చేపట్టాల్సిన పనులపై మాట్లాడారు. ఏఓ జ్యోతిర్మయి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉమామహేశ్వరి, వైస్ ఎంపీపీ గోపాల్‌రెడ్డి, ఆనేపూడి సర్పంచ్ మురళీకృష్ణారెడ్డి, ఎంఈఓ కృష్ణయ్య, ఎంపీడీఓ గోవర్ధన, ఐసీడీఎస్ సీడీపీఓ శారదాంబ, పశువైద్యాధికారి శ్రీదేవి, ఏఈలు హరికృష్ణా, మోహన్, మెహతాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎందరినో తీర్చిదిద్దారు


రాజయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రవి సన్నారెడ్డి

చిట్టమూరు: ఉపాధ్యాయ వృత్తిలో ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దిన ఘనత తన గురువు తుమ్మల రాజయ్యకే చెందుతుందని శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి అన్నారు. మండల పరిధిలోని మన్నెమాల గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు తుమ్మల రాజయ్య బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. తనకు చిన్నతనంలో విద్యనేర్పించిన విశ్రాంత ఉపాధ్యాయుడు మృతి చెందారని తెలుసుకున్న శ్రీసిటీ ఎండీ ఇంటికి చేరుకుని రాజయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిట్టమూరు మండలం అరవపాళెం గ్రామానికి చెందిన రవి సన్నారెడ్డి చిన్నతనంలో అరవపాళెం ప్రభుత్వ పాఠశాల్లో విద్యనభ్యసించారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

దొరవారిసత్రం: నాలుగేళ్లలో గ్రామాల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటుకు కృషి చేస్తామని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తెలియజేశారు. గురువారం తిమ్మనాయుడుకండ్రిగ గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తిమ్మనాయుడుకండ్రిగ గ్రామానికి త్వరలోనే శ్మశానానికి రోడ్డు మార్గం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులునాయుడు, నాయకులు సుధాకర్‌రెడ్డి, రత్నయ్య, ఉదయ్‌కుమార్, ప్రమీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీరు బాటిల్‌తో దాడి

చిల్లకూరు: పూల మొక్కలు విక్రయించే రెండు కుటుంబాలకు చెందిన ఇద్దరి మధ్య నెలకొన్న చిన్నపాటి వివాదం ఘర్షణకు దారి తీసింది. దీంతో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన అంకులపాటూరు సమీపంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు నెల్లూరు డైకాస్ రోడ్డు, ఇందిరమ్మ కాలనీలకు చెందిన రాజు, మహేష్, దిలీప్ అనే వారు పూల మొక్కలు విక్రయించుకుంటూ ఊరూరా తిరుగుతుంటారు. ఈ క్రమంలో వారు నాలుగు రోజుల క్రితం చిల్లకూరు మండలంలోని వివిధ గ్రామాలలో మొక్కలు విక్రయించుకుని సాయంత్రం తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ ఆలయ ఆవరణలో ఉండే వారు. బుధవారం రాత్రి రాజు, మహేష్, దిలీప్ మద్యం తాగే సమయంలో చిన్నపాటి వివాదం నెలకొంది. దీంతో మహేష్ రాత్రికి రాత్రి నెల్లూరుకు వెళ్లిపోయాడు. గురువారం దిలీప్ నెల్లూరుకు వెళ్లిన మహేష్‌ను పిలిపించి ఇద్దరి మధ్య సఖ్యత కుదిరిస్తామని చెప్పాడు. అయితే అప్పటికే రాజు వ్యాపారం నిమిత్తం అంకులపాటూరు వద్దకు వచ్చేశాడు. దిలీప్‌తోపాటు మహేష్ అక్కడికి వచ్చి మాట్లాడుతున్న సమయంలో మహేష్ పక్కనే ఉన్న ఖాళీ బీరు బాటిల్‌ను పగుల గొట్టి రాజుపై దాడికి పాల్పడ్డాడు. దీంతో రాజుకు చాతీపై గాయమైంది. 108 వాహనం ద్వారా అతనిని గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు విచారణ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ముగ్గురికి నేషనల్ మీన్స్‌స్కాలర్‌షిప్

సూళ్లూరుపేట: జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్(జాతీయ ఉపకార వేతనం)కు ఎంపికయ్యారని స్కూల్ ప్రధానోపాధ్యాయుడు కె.శేఖర్ తెలియజేశారు. గురువారం రోజు స్కూల్లో 8వ తరగతి విద్యార్థినులకు అర్హత పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షల్లో కె.స్నైలీ, ఎస్.తీర్థ, బి.సింధు అనే ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్‌ఎం శేఖర్ తెలియజేశారు.

నాగేశ్వరాలయానికి తాత్కాలిక కమిటీ

సూళ్లూరుపేట: పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న శ్రీ గంగాపార్వతి త్రినేత్ర సంభూతుడైన శ్రీనాగేశ్వరాలయంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను నిర్వహించేందుకు తాత్కాలికంగా గురువారం కమిటీని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ నియమించారు. ముప్పాళ్ల శ్రీహరిరెడ్డిని ప్రధాన సభ్యుడిగా నియమించారు. ఆయనతోపాటు నలజాం రాము, మామూడూరు శాంతి, మాటిరెడ్డి సాయికిరణ్, పట్టుపల్లి రాజశేఖర్, చెన్నం శ్రీనివాసులు, బీజేపీకి చెందిన తాటిపర్తి ఆదినారాయణరెడ్డిని సభ్యులుగా నియమించారు.

ఎల్‌ఐసీలో ఉద్యోగాలు భర్తీ చేయాలి

గూడూరు రూరల్: ఎల్‌ఐసీలో ఖాళీగా ఉన్న క్లాస్–3, క్లాస్–4 ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యదర్శి విజయ్‌కుమార్ పేర్కొన్నారు. గూడూరులోని ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద అసోసియేషన్ పిలుపు మేరకు ఉద్యోగులతో కలసి గురువారం నిరసన వ్యక్తం చేశారు. అసోసియేషన్ సభ్యులు మనోజ్, నాగరాజు, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రైవేట్ కంపెనీ బస్సు బోల్తా

చిట్టమూరు: మల్లాం–నాయుడుపేట రహదారి మార్గంలో కొత్తగుంట సమీపంలో ఉన్న పెట్రోల్ బంకు వద్ద గురువారం ప్రైవేట్ కంపెనీ బస్సు బోల్తా పడిన సంఘటనలో గేదె మృతి చెందింది. స్థానికుల వివరాల మేరకు.. వాకాడు మండలం నలగామల గ్రామం నుంచి తడ మండలం శ్రీసిటీకి ప్రైవేట్ కంపెనీ ఉద్యోగులు బస్సులో ఉదయం బయల్దేరారు. ఈ క్రమంలో కొత్తగుంట గ్రామ సమీపంలోకి వచ్చే సరికి ఎదురుగా గేదెలు రావడంతో వాటిని తప్పించబోయి రోడ్డు పక్కనే ఉన్న పంట కాలువలోకి బస్సు బోల్తా పడింది. ఆ సమయంలో బస్సులో 40 మంది ఉద్యోగులు కంపెనీకి వెళ్తున్నారు. అయితే బస్సులో ఎవ్వరికి ఎటువంటి ప్రమాదం జరక్కపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. బస్సు ముందు చక్రాల కింద ఓ గేదె పడడంతో మృతి చెందిందని స్థానికులు తెలిపారు.

భారీగా హుండీ ఆదాయం

రాపూరు: శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలోని హుండీల్లో కానుకల లెక్కింపులో భారీ రాబడి వచ్చిందని డీసీ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. శ్రీవారి క్రేన్ మండపంలో గురువారం హుండీలను లెక్కించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 77 రోజులకు లెక్కించిన శ్రీవారి హుండీల్లో రూ.93,28,696 వచ్చిందన్నారు. బంగారం 220 గ్రాములు, వెండి 3 కేజీల 50 గ్రాములు వచ్చినట్లు చెప్పారు. పలు దేశాల విదేశీ నాణ్యాలు వచ్చినట్లు తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు సీతారామయ్యస్వామి, జిల్లా దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సుధీర్ తదితరులు వివరించారు.

నేదురుమల్లికి ఘన నివాళి


నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



రక్తదానం చేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి రూరల్: వెంకటగిరి నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత దివంగత మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి అని మున్సిపల్ వైస్‌చైర్మన్ సేతరాసి బాలయ్య, జిల్లా సంయుక్త సహాయ కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ వెల్లడించారు. వైఎస్ఆర్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి 90వ జయంతి వేడుకలు వెంకటగిరిలో గురువారం ఘనంగా నిర్వహించారు. త్రిభువని సెంటర్ వద్దకు మోటారుసైకిల్ ర్యాలీగా వెళ్లి నేదురుమల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్ఆర్ సీపీ పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు ఆరి శంకరయ్య, ఎంఏ నారాయణ, శుభావలి, సుబ్బారావు, శివ, వహిద, నాయకులు సీహెచ్ మురళీ, రాజారెడ్డి, వెంకటరత్నంరాజు, ప్రభాకర్, పాదిలేటి దశరథరామిరెడ్డి, రాజారెడ్డి, తలపల మల్లికార్జున్, పేచీరాజ్, రమేష్‌రెడ్డి, సతీష్, వలికల కృష్ణయ్య పాల్గొన్నారు.

విద్యానగర్‌లో..

కోట: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డికి విద్యానగర్‌లోని నేదురుమల్లి సుబ్బరామిరెడ్డి కళాభవన్‌లో గురువారం ఘనంగా నివాళులర్పించారు. నేదురుమల్లి చిత్రపటానికి ఆయన తనయుడు, ఎన్‌బీకేఆర్ విద్యాసంస్థల కరస్పాండెంట్, నేదురుమల్లి ఫౌండేషన్ చైర్మన్ నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి నివాళులర్పించారు. నేదురుమల్లి జయంతి సందర్భంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ మాట్లాడుతూ నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి అభివృద్ధికి మారుపేరుగా నిలిచారన్నారు. రాంకుమార్‌రెడ్డి తనయుడు విక్రమ్‌రెడ్డి, వైఎస్ఆర్ సీపీ నాయకులు యల్లసిరి గోపాల్‌రెడ్డి, భక్తవత్సలరెడ్డి, సంపత్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, నాగూర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు కోటయ్య, షణిల్‌రెడ్డి, ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్యకర్తల జోలికొస్తే ఊరుకోం

వాకాడు: వైఎస్ఆర్ సీపీ కార్యకర్తలపై అకారణంగా తప్పుడు కేసులు పెడితే వదిలి పెట్టే ప్రసక్తే లేదని ఆ పార్టీ వెంకటగిరి నియోజకవర్గం సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. ఈ సందర్భంగా గురువారం వాకాడులో నిర్వహించిన తన తండ్రి, మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి 90వ జయంతి వేడుకల్లో రామ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నాడు. అధికారులు ప్రజలకు సేవ చేయాలే తప్ప కూటమి నాయకుల అండతో అత్యుత్సాహం చూపితే ఇబ్బందులు తప్పవన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

సూళ్లూరుపేట/వెంకటగిరి(సైదాపురం) : వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సూళ్లూరుపేట, వెంకటగిరి అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి.

సూళ్లూరుపేట నియోజకవర్గం:

యువజన విభాగం – పీ నాగార్జున, మహిళా విభాగం – ఎం రత్నశ్రీ, రైతు విభాగం – కే భవాని శంకర్‌రెడ్డి, బీసీ సెల్ – ఎం సుబ్బారావు, ఎస్సీ సెల్ – టీ రాజ్‌కుమార్, ఎస్టీ సెల్ – జీ వెంకటేశ్వర్లు, మైనారిటీ సెల్ – ఎస్‌కే షబ్బీర్, విద్యార్థి విభాగం – తేజారెడ్డి, మున్సిపల్ విభాగం – ఎం రామకృష్ణారెడ్డి, లీగల్ సెల్ – సీ కుమార్, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ – పీ కుమార్, ఐటీ విభాగం – ఎం గోకుల్, వీవర్స్ విభాగం –పి.విజయలక్ష్మి, గ్రీవెన్స్ సెల్ – వడెం సుధాకర్, పంచాయతీ రాజ్ – జే వెంకటకృష్ణారెడ్డి, వలంటీర్స్ – ఎస్.మునిరాజ్, అంగన్‌వాడీ – పీ ప్రవీణ, దివ్యాంగుల – తడ ప్రభు, కల్చరల్ – కే బాలసుబ్రమణ్యం, ఆర్‌టీఐ – అయితా శ్రీధర్, వాణిజ్య విభాగం – కాకి శ్రీరామ్మూర్తి, క్రిస్టియన్ మైనారిటీ సెల్ – కే మోజెస్ వరకళాచంద్ర, వైద్యుల వింగ్ – డాక్టర్ పీ ఉదయ్‌కుమార్, ఇంటలెక్చువల్స్ ఫోరం– ఎస్ శ్రీరాములు యాదవ్, సోషల్ మీడియా – ఎస్ లక్ష్మీ ప్రసన్నకుమార్‌రెడ్డి, బూత్ కమిటీ – గాలి మల్లికార్జున్‌రెడ్డి, పబ్లిసిటీ – బీ మోహన్‌రెడ్డి.

వెంకటగిరి నియోజకవర్గం:

యువజన విభాగం –కొండూరు శ్రీనివాసరాజు, మహిళా విభాగం – కాటూరు రామతులసి, రైతు విభాగం – కమలపూడి సుబ్బారెడ్డి, బీసీ సెల్ – గుర్రం రామ్మూర్తి, ఎస్టీసెల్ – తలపల చెంచు మల్లికార్జున్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ – వెందోటి బాబు, విద్యార్థి విభాగం – లేబాకు మల్లికార్జున్, పంచాయతీ వింగ్– కె రంగనాథం, ఆర్టీఐ – ఆరి శంకరయ్య, వలంటీర్ వింగ్ – దుగ్గిరెడ్డి నరసింహారెడ్డి, గ్రీవెన్‌సెల్ – గుమళ్ల గురుస్వామినాయుడు, వాణిజ్య విభాగం – బట్టేపాటి దయాకర్‌రెడ్డి, లీగల్‌సెల్ – చిన్నంబెట్టి బాబ్జి, కల్చరల్ వింగ్ – ఎం వెంకటేశ్వర్లు, సోషల్ మీడియా – పరుచూరి రమేష్‌గౌడ్, ఐటీ వింగ్ – మోదిరెడ్డి మునిరామయ్య, వైద్యుల విభాగం – డాక్టర్ ఎస్‌కే ఖాదర్‌బాషా, ఇంటెలెక్చువల్స్ ఫర్మ్ – వై శ్రీనివాసులు, బూత్ కమిటీ – యల్లంరాజు వరప్రసాద్‌రాజు నియామకం అయ్యారు.

గళమెత్తిన ప్రజాప్రతినిధులు


మాట్లాడుతున్న ఎంపీడీఓ అన్నపూర్ణారావు

వాకాడు: మండలంలో నెలకొని ఉన్న పలు సమస్యలపై మండలంలోని ప్రజాప్రతినిధులు గళమెత్తారు. వాకాడు స్త్రీశక్తి భవనంలో గురువారం ఎంపీపీ కొడవలూరు అనుసూయమ్మ అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో నెలకొని ఉన్న తాగునీరు, డ్రైనేజ్, రోడ్లు, పారిశుధ్యం తదితర ప్రధాన సమస్యలను ప్రజాప్రతినిధులు ఎంపీపీ దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను పరిష్కరిస్తామని ఎంపీడీఓ అన్నపూర్ణారావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకటరమణయ్య, డీటీ సందీప్ కుమార్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.